ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 10 అక్టోబరు 2024 | 5



● (అమలాపురం-ఆంధ్రజ్యోతి)



మరో 2 రోజులు

ఇప్పటివరకు 2,586 దరఖాస్తులు

3,500 వస్తాయని అంచనా

రేపటి వరకు దరఖాస్తుకు గడువు


14న కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా

మద్యం షాపుల దరఖాస్తులకు వ్యాపారుల నుంచి మంచి స్పందన కనిపిస్తుంది. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు అంచనాలకు అనుగుణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో దరఖాస్తులు దాఖలు కావచ్చునని తెలుస్తుంది. బుధవారం సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 133 మద్యం షాపులకు సంబంధించి ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు 2586 దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే ప్రభుత్వం గడువు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండవచ్చునని ఎక్సైజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు

జిల్లాలోని వివిధ వర్గాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు మద్యం షాపుల కోసం నిర్దేశించిన దరఖాస్తుల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా దరఖాస్తుల స్వీకరణకు అక్టోబరు 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌తో సహా అన్ని విధానాల్లోను దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉందన్నారు. అక్టోబరు 12, 13 తేదీల్లో మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తారు. 14వ తేదీన జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో మద్యం షాపుల లాటరీని తీస్తారు. అదేరోజు షాపు కేటాయింపు ప్రక్రియ పూర్తిచేసి అక్టోబరు 16వ తేదీ నుంచి ఆయా షాపుల్లో మద్యం విక్రయాలు చేసుకునేలా అనుమతులిస్తారు. ప్రస్తుతం కోనసీమ జిల్లాలో 2586 దరఖాస్తులు అందినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ తెలిపారు. వాస్తవానికి బుధవారం ప్రభుత్వం ముందు విధించిన గడువు మేరకు 3500 దరఖాస్తులు జిల్లాలో మద్యం షాపులకు దాఖలవుతాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే అందుకు చేరువలోనే దరఖాస్తులు దాఖలవుతున్నాయి. అమలాపురం పట్టణంలో అయితే ఐదు మద్యం షాపులకు, షాపునకు 40 దరఖాస్తులు చొప్పున దాఖలయ్యాయంటే వ్యాపారుల మధ్య పోటీతత్వం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు అధికార టీడీపీ ప్రజాప్రతినిధులతో పాటు విపక్ష పార్టీల నేతలుగా కూడా మద్యం వ్యాపారంపై దృష్టి పెట్టారు. దాంతో వ్యాపారులు సిండికేట్‌లుగా మారి భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తుండడంతో దరఖాస్తులు దాఖలు చేసే సమయంలో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అధికార టీడీపీ ప్రజాప్రతినిధులు తమ సంగతి ఏంటంటూ వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నట్టు కూడా విశ్వసనీయంగా తెలిసింది. గురువారం అష్టమి ఘడియలు కావడంతో శుక్రవారం షాపులకు భారీగా దరఖాస్తులు రావచ్చునని ఎక్సైజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. గడువు పొడిగించడంతో వ్యాపారుల మధ్య పోటీతత్వం మరింత పెరిగి దరఖాస్తుల సంఖ్య భారీగా పెరగవచ్చునని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. షాపునకు రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ డిపాజిట్‌గా చెల్లించాల్సి రావడంతో ఇప్పటికే దరఖాస్తుల రూపంలో రూ.50 కోట్లకు పైబడిన ఆదాయం ప్రభుత్వానికి చేకూరినట్టయింది. వాస్తవానికి ఎక్సైజ్ శాఖ రూ.70 కోట్లు అంచనాగా భావిస్తుండగా రూ.50 కోట్లు ఆదాయం ఇప్పటికే వచ్చింది.



నేటి నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

ద్రాక్షారామ, అక్టోబరు 9: రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి స్మారక 9వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రామచంద్రపురం అధ్యక్షుడు డా.సి.స్టాలిన్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. పోటీలను మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిస్తారని 12న ముగింపు సభకు ఎంపీ గంటి హరీష్ మాధుర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరవుతారని తెలిపారు. మూడు రోజుల పాటు బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు.

14న జాబ్‌మేళా

అమలాపురం టౌన్, అక్టోబరు 9: ఈ నెల 14న పి.గన్నవరం మండలం నరేంద్రపురంలోని ఏపీఎస్ డబ్ల్యుఆర్ఐఈఎస్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారిణి యి.వసంతలక్ష్మి తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలెప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అపోలో ఫార్మాసిస్ లిమిటెడ్, ఎల్ఐసీ, క్రెడిట్‌రైట్ ఫైనాన్స్ సంస్థల్లో ఫార్మాసిస్ట్, అసిస్టెంట్ ఫార్మాసిస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్, అడ్వైజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఎంపికైన అభ్యర్థులకు రూ.10,500 నుంచి రూ.40వేల వరకు వేతనం అందజేస్తారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బి.ఫార్మశీ, ఎం.ఫార్మశీ చదివిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్సు కాపీలతో 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు నరేంద్రపురం జూనియర్ కళాశాల వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 8247645389ను సంప్రదించాలన్నారు.



డ్రెయిన్ గట్టును పటిష్టం చేస్తున్న దృశ్యం

కూనవరం మేజర్ డ్రెయిన్

ఆధునికీకరణకు శ్రీకారం

● (ఉప్పలగుప్తం)

కూనవరం డ్రెయిన్ ఆధునికీకరణ మొదలు

ధ్వంసమైన ఎడమ గట్టు పటిష్టతకు చర్యలు

డ్రెడ్జర్‌తో డ్రెయిన్‌లో ఇసుక మేటలు తొలగింపు

డ్రెయిన్‌లో ప్రవాహ వేగం పెంచేలా ప్రణాళిక

సముద్ర జలాల పోటు పాటుల సమతుల్యతకు వ్యూహం



ధ్వంసమైన డ్రెయిన్ గట్టు

జిల్లాలో కొత్తపేట నుంచి ప్రారంభమై అమలాపురం రూరల్, అల్లవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, అయినవిల్లితో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చే ముంపునీటిని సముద్రంలోకి పంపే కూనవరం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. 2011లో కోనసీమలో క్రాప్ హాలిడే ప్రకటించడానికి అధ్వాన డ్రైనేజీ వ్యవస్థే కారణమని మోహన్‌కందా కమిటీ తేల్చింది. డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కమిటీ సిఫార్సు చేసింది. పాలకులు మాత్రం ఆ దిశగా ఒక్క అడుగు వేయకపోవడం గమనార్హం.

కూనవరం మేజర్ డ్రెయిన్ విషయానికి వస్తే ఎగువ, దిగువ అనే తేడా లేకుండా ఏ ప్రాంతంలో వానొచ్చినా వరదొచ్చినా ముంపు నీరంతా సముద్రంలోకి పోవాలంటే కూనవరం మేజర్ డ్రెయినే దిక్కు. దశాబ్దాల తరబడి ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో కూనవరం డ్రెయిన్‌లో నీటి ప్రవాహం మందగించింది. డ్రెయిన్ శివారులో రాఘవులపేట వంతెన వద్ద నుంచి ఇసుక మేటలు వేసింది. పదేళ్ల క్రితం ఎక్సకవేటర్‌తో డ్రెయిన్‌లో బురదను తీసి గట్టుమీద వేశారు. దీనివల్ల రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. పొలాలు ఏటా ముంపు బారిన పడి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ముంపునీరు సముద్రం, పర్రల్లోకి పోవాలంటే డ్రెయిన్‌లో ప్రవాహ వేగం తగినంతగా ఉండాలి. ఎగువ నుంచి వేగంగా వస్తున్న ముంపునీరు రాఘవులపేట ప్రాంతంలోకి వచ్చేసరికి ఒక్కసారిగా వేగం మందగించడంతో సమీపంలోని పంటపొలాలు మునిగిపోతున్నాయి. ఇక సముద్రం నుంచి పోటు సమయంలో డ్రెయిన్‌లోకి ఉప్పునీరు ప్రవహించడం, పాటు సమయంలో తిరిగి సముద్రంలోకి వెళ్లడం సాధారణమే. అయితే పోటుపాటుల్లో ప్రవాహ వేగం సమంగా ఉంటేనే డ్రెయిన్ ఆయకట్టు పొలాలకు రక్షణ ఉంటుంది. డ్రెయిన్‌లో ఇసుక మేటలు వేయడం, గట్లు పటిష్టంగా లేకపోవడంతో పాటు సమయంలో ప్రవాహ వేగం తగ్గి పొలాల్లోకి ఉప్పునీరు చేరుతోంది. ఫలితంగా పంట నష్టం జరుగుతోంది. ఈ కారణంగానే సముద్రం మొగ తవ్వినా వెంటనే మూసుకుపోతోంది.


ప్రవాహ వేగం పెంచేందుకు..

డ్రెయిన్‌లో ప్రారంభం నుంచి శివారుకు ఒకేలా ప్రవాహ వేగం ఉండాలంటే డ్రెయిన్‌లో మేటలను తొలగించాలి. రాఘవులపేట వంతెన దిగువ నుంచి ఇసుక మేటలు వేసిన కారణంగా ఎక్సకవేటర్‌తో తొలగింపు సాధ్యం కాదు. డ్రెడ్జర్ ద్వారా పూడికతీత జరగాలని కలెక్టర్, ఎమ్మెల్యే, డ్రెయిన్స్ అధికారులు వ్యూహం రచించారు. చివరి వరకు డ్రెయిన్ ద్వారా నీరు పర్ర, సముద్రంలోకి పోవాలంటే డ్రెయిన్ గట్లు బలపరచాలి. గతంలో అనేక సార్లు రక్షణ చర్యలు చేపట్టినప్పటికీ డ్రెయిన్ ఎడమ గట్టు మొగకు దగ్గరలో పూర్తిగా ధ్వంసమయ్యింది. ఇప్పుడా గట్టును పటిష్టం చేసే చర్యలు ప్రారంభించారు. వంతెన వద్ద నుంచి ఎడమ గట్టును పటిష్టం చేస్తున్నారు. కూనవరం మేజర్ డ్రెయిన్‌లో ముంపునీటి ప్రవాహ వేగంలో సమతుల్యత లోపం కారణంగానే ఎన్నిసార్లు తవ్వినా సముద్రం మొగ మూసుకుపోతోందని పరిశీలనలో తేల్చారు. కూనవరం డ్రెయిన్ ఆధునికీకరణ నూరు శాతం పూర్తయితే ముంపునీరు దిగేందుకు అవరోధాలు తొలగి, ముంపు నుంచి పొలాలకు రక్షణ లభిస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు.



ఇసుక మేటలు తొలగించేందుకు సిద్ధం చేసిన డ్రెడ్జర్

ఆ భూములపై ఆరా



'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

మండపేట, అక్టోబరు 9: ఫ్రీ హోల్డ్ విధానంలో అసైన్డ్ భూములను కొందరు అక్రమంగా చేజిక్కించుకున్నారనే వ్యవహారంపై 'ఆ భూములు ఎవరి చేతుల్లో' అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలోప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లి, ద్వారపూడి, జెడ్.మేడపాడులో అసైన్డ్ ల్యాండ్స్ చేతులు మారిన వ్యవహారంపై ఆరా తీస్తున్నారు. భూములు మార్పులు చేర్పులు మాటున అప్పటి వైసీపీ ప్రభుత్వంలో భారీగా నగదు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మండపేట మండలం ద్వారపూడి, వేములపల్లి. జెడ్.మేడపాడులో ఎక్కువగా భూముల గోల్‌మాల్ జరిగినట్లు తెలిసింది. ఈ భూముల వ్యవహారంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఉన్నతాధికారులు ద్వారపూడిలో పనిచేస్తున్న వీఆర్‌వోను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బుధవారం పిలిపించి భూములు వ్యవహారంపై సమాచారం సేకరించినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అధికారి అసైన్డ్ భూములకు సంబంధించిన వారి పేర్లు మార్పులు చేసారా లేదా అనేదానిపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు.



గగుర్పాటు కలిగించే విన్యాసాలు

చెడీతాలింఖానా



సన్నాహక ప్రదర్శన

అమలాపురం టౌన్, అక్టోబరు 9: అమలాపురం మహిపాలవీధిలోని శ్రీఅబ్బిరెడ్డి రామదాసు చెడీ తాలింఖానా 169వ వార్షికోత్సవ సన్నాహక ప్రదర్శన బుధవారం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించారు. చెడీ తాలింఖానా గురువు అబ్బిరెడ్డి మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సన్నాహక ప్రదర్శనలో అధిక సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. కర్రసాము, కత్తిసాము, బంతుల తాళ్లు, లేడి కొమ్ములు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అబ్బిరెడ్డి రామదాసు, అబ్బిరెడ్డి నరసింహారావు, మూడో తరానికి చెందిన అబ్బిరెడ్డి రామదాసు వారసత్వ సంపదగా చెడీ తాలింఖానా విద్యను దసరా ఉత్సవాల్లో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నాలుగో తరం వారసత్వంగా వీరవిద్యను ఈ నెల 12న ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

12 రీచ్‌లకు అనుమతులు

నీటి ప్రవాహం తగ్గగానే ఇసుక తవ్వకాలకు చర్యలు

ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నదిలో నీటి ప్రవాహం తగ్గగానే ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అన్నిశాఖల అనుమతులతో పన్నెండు ఇసుక రీచ్‌లను గుర్తించామన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 12 ఇసుక రీచ్‌లలో ఇసుకను తవ్వే ఏజెన్సీలు, కాంట్రాక్టర్ల ఎంపికకు సంబంధించిన విధివిధానాలను జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్ నోటిఫికేషన్ కమిటీ గురువారం తయారు చేస్తుందన్నారు. త్వరలోనే టెండరు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. పట్టా భూముల్లో ఇసుకను తవ్వుకోవడానికి రైతులు దరఖాస్తులు పెట్టుకుంటారని సంబంధిత భూములను రెవెన్యూ, గ్రౌండ్ వాటర్, రివర్ కన్జర్వేటర్, వ్యవసాయం, మైన్స్ శాఖల అధికారులు సభ్యులుగా ఉన్న జాయింట్ యాక్షన్ కమిటీ పరిశీలించి ఇసుకను తవ్వవచ్చా లేదా అనేది నిర్ధారిస్తుందన్నారు. 12 రీచ్‌ల నుంచి ఇసుకను బయటకు తీసుకువచ్చేందుకు అవసరమైన ర్యాంపు పాయింట్లు, యాక్సెస్ రోడ్లు, ఇసుకను నిల్వ చేసేందుకు స్టాకు యార్డులను సంబంధిత ఆర్డీవోలు గుర్తించాలన్నారు. పోలీసుల సహకారంతో అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాకు యార్డుల వద్ద పోలీసుశాఖ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక వెలికితీత, రీచ్‌ల నిర్వహణ, పన్నులు అన్నీ కలిపి ఖర్చు ఎంతమేర అవుతుందో తదుపరి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో నిర్ణయిస్తామన్నారు. ఇసుక రీచ్‌ల వద్దకు వెళ్లే భారీ వాహనాలు ఏటిగట్లు దాటాల్సిన పరిస్థితులు ఉంటే బలహీనమైన ఏటిగట్లను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని జలవనరులశాఖ హెడ్‌వర్క్స్ అధికారులకు సూచించారు. ఇసుక ర్యాంపుల రవాణా వాహనాలకు ఇన్వాయిస్ ఇవ్వడానికి అవసరమైన మొబైల్ ఫోన్లు, పీవోఎస్ మిషన్లు కొనుగోలు చేయాలన్నారు. ఇసుక బుకింగ్, రవాణా తదితర సమస్యలను పరిష్కరించడానికి జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో వివిధ శాఖల సిబ్బందితో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, కొత్తపేట, అమలాపురం, రామచంద్రపురం ఆర్డీవోలు శ్రీకర్, కె.మాధవి, కతీబ్‌కౌశర్‌భానో, జిల్లా మైన్స్ అధికారి బి.అశోక్‌కుమార్, ఇసుక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

766 ఉపాధి పనులకు గ్రీన్‌సిగ్నల్

అమలాపురం టౌన్, అక్టోబరు 9: జిల్లాలోని 315 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.54.30 కోట్ల ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో 766 పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అత్యధికంగా రూ.50.03 కోట్ల నిధులతో 84.17 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశామన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల కార్యక్రమ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అనుమతులు పొందిన పనులకు శంకుస్థాపనలు చేయాలని సూచించారు. సంక్రాంతిలోపు ఆ పనులన్నింటినీ పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ, జిల్లాపరిషత్, ఆర్థిక సంఘం నిధులతో గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుతం జరుగుతున్న పనులు, పూర్తి అయిన పనుల వివరాలను ప్రజలకు తెలిసేలా సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో చెత్తనుంచి సంపద సృష్టించే కేంద్రాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని పంచాయతీల్లో చెత్త వేసేందుకు డంపింగ్ యార్డుల లేనందున ఏయే పంచాయతీల్లో స్థలాలు అవసరముందో నివేదిక సమర్పించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీపీవో శాంతలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, జిల్లా మైన్స్ అధికారి అశోక్‌కుమార్, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఏపీవోలు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా...



'లోవ'లో తలుపులమ్మ అమ్మవారు

ప్రసిద్ధ పుణ్య క్షేత్రం లోవ దేవస్థానంలో అమ్మవారు శ్రీసరస్వతీ దేవిగా అనుగ్రహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులతో పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- తుని రూరల్



రత్నగిరిపై వనదుర్గ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ బుధవారం సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వీణాపాణియై విద్యాబుద్ధులు ప్రసాదించే దేవిగా అనుగ్రహించారు. మూల నక్షత్రం సందర్భంగా కనకదుర్గ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు.
- అన్నవరం



కొబ్బరి బొండంపై కనకదుర్గమ్మ

ఫ్రూట్ కార్వింగ్ ద్వారా కొబ్బరి బొండంపై కనకదుర్గ అమ్మవారిని చెక్కారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. దేవీ శరన్న వరాత్రుల సందర్భంగా తనకు ప్రావీణ్యమున్న కళ ద్వారా అమ్మవారిని చెక్కి, విజయదశమి విశిష్టతను గ్రామస్తులకు వివరించారు.
- గొల్లప్రోలు





త్రికోటి సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు, సరస్వతీ దేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు

శ్రీపీఠంలో వైభవంగా త్రికోటి సరస్వతి పూజ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 9: కాకినాడ శ్రీపీఠంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో త్రికోటి సరస్వతి పూజను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మహాశక్తి యాగం బుధవారం ఏడో రోజుకు చేరుకుంది. స్వామీజీ మాట్లాడుతూ మనకు మేధస్సు, ప్రజ్ఞ, జ్ఞానం ఇవ్వడంతో పాటు వాటిని ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉపయోగించాలో నేర్పే తెలివితేటలను సరస్వతిదేవి అనుగ్రహిస్తుందన్నారు. భగవంతుడిని గాడ్‌గా పిలుస్తామని.... జీ అంటే జనరేటర్ బ్రహ్మ అని, ఓ అంటే ఆర్గనైజర్ బ్రహ్మ చేసిన పనిని సక్రమంగా పూర్తి చేసేది విష్ణువని... డి అంటే డిసాల్వర్, బ్రహ్మ, విష్ణువు చేసిన పనులన్నింటినీ ఆవలోకనం చేసి సృష్టి, స్థితి, లయకారకుడిగా శివుడు ఉన్నారన్నారు. సుమారు 30వేల మంది విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కవి, సినీ గేయ రచయిత, అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అతిథిగా హాజరయ్యారు. 200 మంది విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారు సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూల నక్షత్రం సందర్భంగా వేద పండితులు విశేష పూజలు, శతకోటి కుంకుమార్చన, లలితా రహస్య సహస్రనామ పారాయణ చేశారు. సుమారు 30వేలకు పైగా మాతృ మూర్తులు పాల్గొన్నారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ట్రాఫిక్ సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు, హెచ్‌సీ, కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పోటీ

» టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

కాకినాడ సిటీ, అక్టోబరు 9: త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పోటీ చేస్తుందని, అభ్యర్థి ఎంపికపై కసరత్తు జరుగుతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కూటమి ఎమ్మెల్యేలు, నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యనమల మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాధ్యత వహించి పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించామన్నారు. ఈ బాధ్యతను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పట్టభద్రుల ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల ఈ దఫా గణనీయంగా పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు.

గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని, దాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అనేక రకాల అవస్థలు పడుతోందని యనమల తెలిపారు. సమస్యలు అధికంగా ఉన్నా హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు రావాలని, అవి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజలు అర్థం చేసుకుని అంతవరకు ఓపిక పట్టాలన్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందుండాలనే ధ్యేయంతో తమ ప్రభుత్వం పయనిస్తోందన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అరాచకం, అవినీతివల్ల అభివృద్ధిలో వెనుకపడడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణుడు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

అందువల్లే వేగంగా అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నారన్నారు. అందరం కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అభ్యర్థిని ఎంపిక చేస్తామన్నారు.

సమావేశంలో ఎమ్మెల్సీ పరిశీలకుడు భూమిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు, పంతం నానాజీ, అయితాబత్తుల ఆనందరావు, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప, మిరియాల శిరీషదేవి, వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, టీడీపీ పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, పెందుర్తి వెంకటేష్, చిక్కాల రామచంద్రరావు, నేతలు నురుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మోకా ఆనందసాగర్, పెంకే శ్రీనివాసబాబా, కటకంశెట్టి బాబి, జనసేన నేతలు మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మల బాబు, వరుపుల తమ్మయ్యబాబు, బీజేపీ నాయకుడు గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



నమూనా దస్తావేజును ఈవోకు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, దాత ఆదిమూర్తి దంపతులు

బాలాత్రిపురసుందరి ఆలయానికి
అర ఎకరం భూదానం

కాకినాడ సిటీ, అక్టోబరు 9: కాకినాడలోని శ్రీ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయానికి కాకినాడకు చెందిన రెడ్డి ఆదిమూర్తి దంపతులు జగ్గంపేట మండలం కాండ్రేగులలో రూ.35లక్షలు విలువైన భూమిని దానంగా ఇచ్చారు. ఈ భూమి దస్తావేజును బుధవారం ఆలయంలో దాత కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుతో కలిసి ఈవోకు అందజేశారు. దాతకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు పాల్గొన్నారు.



అమ్మవారికి చీర సమర్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

జ్ఞాన సరస్వతి అమ్మవారికి మూడు కిలోల
వెండి చీర బహూకరణ



రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని జ్ఞాన సరస్వతి అమ్మవారికి వైద్యుడు డాక్టర్ సునీల్‌కుమార్ మూడు కిలోలతో వెండి చీర చేయించారు. బుధవారం దానిని ఆలయ ఈవో శ్రీనివాస్‌కు అందజేశారు. తొలుత ఆయన అమ్మవారికి పూజలు జరిపారు. కోళ్ల రవికుమార్, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





పుట్టినరోజు వేడుక జరిగిన గెస్ట్ హౌస్, డ్రగ్స్‌తో దొరికిన కారు

భూపాలపట్నంలో
డ్రగ్స్ కలకలం

» పోలీసుల అదుపులో నిందితులు
» పుట్టినరోజు వేడుకలో మాదక ద్రవ్యాలు వినియోగం
» రహస్యంగా దర్యాప్తు చేస్తున్న రాజానగరం పోలీసులు
» ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన

రాజానగరం, అక్టోబరు 9: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నం సమీపంలోని ఓ గెస్ట్‌హౌస్‌లో పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని కొంతమంది యువకులు డ్రగ్స్ సేవిస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తాడేపల్లిగూడెం, హైదరాబాద్, వైజాగ్ ప్రాంతాలకు చెందిన కొంతమంది యువకులు ఈనెల 7వ తేదీ రాత్రి ఈ గెస్ట్‌హౌస్‌లో పుట్టినరోజు వేడుకల్లో మాదక ద్రవ్యాలు సేవిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, అనుమానిత యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టుగా తెలిసింది. దీనిలో ప్రధానంగా తాడేపల్లిగూడేనికి చెందిన యువకుడు గత కొంతకాలంగా దివాన్‌చెరువులో నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి మారుమూల ప్రాంతమైన భూపాలపట్నం శివారులోని ఒక గెస్ట్‌హౌస్‌ను ఎంచుకుని పుట్టినరోజు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. దీనిలో భాగంగా అధిక సంఖ్యలో యువత పాల్గొని పబ్ సంస్కృతిని తలపించేలా ఏర్పాట్లలో మునిగితేలినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేశారు. దీంతో పలువురు యువకులు, యువతులు అక్కడి నుంచి పరుగులు తీయగా, వీరిలో ముగ్గురు యువకులు మాత్రం పోలీసులకు చిక్కారు. వీరిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వీరు వచ్చిన కారును తనిఖీ చేయగా కారులో కొకైన్, గంజాయి పొట్లాలు తదితర మాదక ద్రవ్యాలు లభించినట్టు తెలిసింది. నిందితుల నుంచి పూర్తి వివరాలు రాబట్టేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. ఈ విషయమై సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌ను సంప్రదించగా.... విచారణ కొనసాగుతోందంటూ వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.





రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు, తృతీయ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జట్టు సభ్యులు

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ విజేత చిత్తూరు

దివాన్‌చెరువు, అక్టోబరు 9: క్రీడాకారులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ సూచించారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మూడు రోజులు జరిగిన రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన విజయప్రకాష్ మాట్లాడుతూ క్రీడాకారులకు సాధనతో పాటు తీసుకునే ఆహారం విషయంలో కూడా ఎంతో జాగ్రత్త అవసరమన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కోరారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ టోర్నీలో చిత్తూరు (ప్రథమ), శ్రీకాకుళం (ద్వితీయ), తూర్పు గోదావరి (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. రాష్ట్ర స్థాయి విజేతలు తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే స్వామి తెలిపారు. కార్యక్రమంలో డీవైఈవో నారాయణ, పరిశీలకుడు ఎంవీ నాగేంద్ర, శ్రీప్రకాష్ విద్యానికేతన్ మేనేజరు ఏఎస్ఎన్ మూర్తి, వ్యాయామోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, కోశాధికారి వీరబాబు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

దివాన్‌చెరువు అక్టోబరు 9: రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 22 మంది క్రీడాకారులతో అండర్-17 బాలురు విభాగంలో హ్యాండ్‌బాల్ జాతీయ జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో తెలంగాణలో జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని చెప్పారు. అంతకు ముందు తూర్పు గోదావరి జిల్లాలోనే వీరికి శిక్షణ ఇస్తారన్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన వారు జిల్లాల వారీగా.... కె.తేజసాయిరెడ్డి, జి.తంగరాజ్, ఎం.యోగీశ్వర్, కె.చైతన్యకుమార్, ఆర్ఆర్ నాయక్ (చిత్తూరు), రాజనాల వేదాంత సాయి, తిన్ని దిల్లేశ్వర రావు, గొర్రెల దిల్లేశ్వరరావు (శ్రీకాకుళం), కొల్లాబత్తుల సెల్విక్, అంగారపు వెంకటగణేష్, రావిపాటి శ్రీసత్యపవన్ (తూర్పు గోదావరి), ఎ.దేవసూర్యసాయి. వి.గౌరీశంకర్ (విశాఖపట్నం), పి.దేవిచరితసత్య (ప్రకాశం), పి.జశ్వంత్ (విజయనగరం), ఎం.ప్రసాద్‌నాయక్, జి.వినయ్ (కర్నూలు), దాసరి జాషువ (నెల్లూరు), మోపిదేవి తన్విస్ (కృష్ణా), అద్దంకి రాజ్‌పాల్ (గుంటూరు), ఎస్.ఆదిశేషారెడ్డి (కడప), సాయిమహేశ్వర్ (అనంతపురం)

తల్లిదండ్రులు మందలించారని
యువకుడి ఆత్మహత్య

గొల్లప్రోలు, అక్టోబరు 9: తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన విశ్వనాథుల శివ (25) తాపీ పని చేస్తాడు. ఏడాదిన్నర క్రితం పల్సర్ బైక్‌ను ఫైనాన్స్‌పై కొనుగోలు చేశాడు. అప్పుడప్పుడు వాయిదాలు కట్టకపోవడంతో అతడి తల్లి దుర్గ వాయిదాలు చెల్లించేది. వాయిదాలు కట్టకపోవడంతో 20 రోజుల క్రితం ఫైనాన్స్ ప్రతినిధులు వచ్చి బైక్ తీసుకుని వెళ్లిపోయారు. అతడి తల్లి మళ్లీ వాయిదాలు కట్టి విడిపించింది. పనికి కూడా సక్రమంగా వెళ్లట్లేదు. ఫైనాన్స్ ఎలా కడతావు అంటూ మంగళవారం సాయంత్రం శివను తల్లిదండ్రులు దుర్గ, జగ్గారావు మందలించారు. దీంతో మనస్తాపానికి గురయిన శివ రాత్రి సమయంలో ఎలుకలకు పెట్టే మాత్రలు వేసుకుని వాంతులు చేసుకుంటుండగా, స్నేహితుడు ఉమ గమనించి ఇంటికి తీసుకొచ్చాడు. కుటుంబసభ్యులు అతడిని తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బేబీ ప్రశాంతి (పాత చిత్రం)

గుర్తు తెలియని వాహనం ఢీకొని పారా లీగల్ వలంటీర్ మృతి

మరో మహిళకు గాయాలు

దివాన్‌చెరువు, అక్టోబరు 9: తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దివాన్‌చెరువులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక మహిళ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి బొమ్మూరు ఎస్ఐ ఎస్పీ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం అంబేడ్కర్ నగర్‌కు చెందిన పెనుగుల బేబీ ప్రశాంతి (41) పారా లీగల్ వలంటీర్‌గా పని చేస్తోంది. ఆమె జీఎస్ఎల్ ఉద్యోగి కె.సత్యవతితో కలిసి మోటారు సైకిలుపై రాజమహేంద్రవరం వైపు వెళ్తోంది. ఆటోనగర్ సమీపంలోని ఫ్రెండ్స్ దాబా వద్దకు చేరుకునే సరికి గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిలును ఢీకొంది. తలకు బలమైన గాయాలు కావడంతో బేబీ ప్రశాంతి అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ సత్యవతిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

నిడదవోలు/చాగల్లు, అక్టోబరు 9: తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం దారవరం రైల్వే గేటు సమీపంలో ఒక మహిళ మృతదేహం లభ్యమైంది. రైల్వే కీమెన్ ఇచ్చిన సమాచారంతో వెళ్లి చూశారు. ఆమెను బ్రాహ్మణగూడేనికి చెందిన కొండేపాటి కుమారి (41)గా గుర్తించారు. మంగళవారం రాత్రి అత్తమామలతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయింది. దారవరం రైల్వే గేటు సమీపంలో వెళ్లే రైలుకిందపడి తీవ్ర గాయాలతో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నిడదవోలు రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు చెప్పారు.

బాలికపై అత్యాచారం కేసులో
ఇద్దరు నిందితుల అరెస్టు

పిఠాపురం, అక్టోబరు 9: కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని మాధవపురం రోడ్డులో బాలికపై అత్యాచారం ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ బుధవారం సాయంత్రం విలేకరులకు వెల్లడించారు. పట్టణంలోని స్టేట్ బ్యాంకు సమీపంలో 16 సంవత్సరాల బాలికను ఒక ఆటోడ్రైవర్, అతని స్నేహితురాలు కిడ్నాప్ చేసి పట్టణ శివారులోని డంపింగ్ యార్డు సమీపంలోని గోదావరి కాలువ గట్టు వద్దకు తీసుకువెళ్లి బలవంతంగా మద్యం పట్టించి అత్యాచారం చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. దీనిపై పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో పలు సెక్షన్లు, పోక్సో, జువైనల్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేశారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో పిఠాపురం సీఐ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పిఠాపురం-గొర్స రోడ్డులోని రైసుమిల్లు సమీపంలో సంచరిస్తుండగా అత్యాచారానికి పాల్పడిన ఆటోడ్రైవర్ దుర్గాడ లక్ష్మయ్య అలియాస్ జాన్, అతడికి సహకరించిన ఇందిరా నగర్‌కు చెందిన కొంగుపూడి సుబ్బలక్ష్మిని అరెస్టు చేసి ఆటోను, మద్యం సీసాను సీజ్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.



నిందితులను చూపిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్

ఉచిత న్యాయ సహాయానికి
డయల్ 15100

రాజమహేంద్రవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సహాయానికి 15100 నెంబరుకు ఫోన్ చేసి సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఈ నెంబరుకు విస్తృత ప్రచారం కల్పించడంలో భాగంగా పోస్టర్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించామన్నారు. పారా లీగల్ వలంటీర్ల ద్వారా ప్రభుత్వాస్పత్రులు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు, పాఠశాలలు, కళాశాలలు, ఆటో స్టాండ్లు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో పోస్టర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎండాకు తెగులు నివారణకు యూరియా తగ్గించాలి

కె.గంగవరం, అక్టోబరు 9: ఎండాకు తెగులు నివారణకు యూరియా వాడకం తగ్గించాలని ఏడీఏ రాజశేఖర్ అన్నారు. బుధవారం కోట గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో వరిలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎండాకు తెగులు నివారణకు ప్లాంటామైసిన్ బ్యాక్టీరియాను విడిగా పిచికారీ చేయాలని, చివరి కోటాలో ఎకరాకు 20కిలోల చొప్పున పొటాష్ ఎరువు పిచికారీ చేయాలన్నారు. ఆత్మ పీడీ జ్యోతిర్మయి, ఏవోలు మనోహర్, బలుసు రవి, రైతులు పాల్గొన్నారు.

● అరుపులు.. కేకలతో దద్దరిల్లిన మండల పరిషత్ సమావేశం ● విద్యుత్ శాఖ అధికారుల డుమ్మా ● పలు శాఖలపై సభ్యుల ప్రశ్నలు

మండల పరిషత్ సమావేశంలో ప్రొటోకాల్‌పై రగడ

అమలాపురం రూరల్, అక్టోబరు 9: అధికారులు గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి సుబ్బరామ్ పేర్కొన్నారు. గృహనిర్మాణ శాఖ అధికారులు సర్వే పేరుతో గ్రామాల్లో తిరుగుతున్న ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వరా అని ప్రశ్నించారు. దీంతో సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు కల్పించుకుని గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడైనా, ఎవరికైనా సమాచారం ఇచ్చేవారా అని మండిపడ్డారు. ఇలా సభ్యుల అరుపులు, కేకలతో అమలాపురం మండల పరిషత్ సమావేశం దద్దరిల్లింది. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణ శాఖ ఏఈ వినయ్‌వర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు రూపాయి చొప్పున జమ చేయడం జరిగిందని, ఆయా ఖాతాలను సర్వే చేస్తున్నట్టు తెలిపారు. మండలంలో 1198మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. లబ్ధిదారులకు రూ.2.77 కోట్లు చెల్లించాల్సి ఉన్నందున వాటిని సర్వేచేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. 2025 మార్చి నాటికి బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందని, ఆ తరువాత మాత్రమే కొత్తగా గృహనిర్మాణ రుణాలు మంజూరు చేస్తామన్నారు. డిసెంబరు 2023లో ప్రకృతి విపత్తు కారణంగా పంట నష్టం జరిగితే ఇంతవరకు ఎందుకు పరిహారం చెల్లించలేదని పందిరి శ్రీహరి మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్‌ను ప్రశ్నించారు. నష్టపరిహారం చెల్లింపులో కొన్ని గ్రామాలు నిలిచిపోయాయని, రాష్ట్ర వ్యాప్తంగా 1.12లక్షల బ్యాంకు ఖాతాలకు చెల్లించాల్సిన పరిహారాలపై రెండు నెలలుగా వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి తెలియచేస్తున్నట్టు ఆయన వివరించారు. విద్యుత్‌శాఖ అధికారులు సమావేశానికి రాకపోవడం, విద్యుత్ శాఖకు సంబంధించి గ్రామాల్లోని పలు సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ఎంపీపీ భాగ్యలక్ష్మి సభ్యుల తరపున ప్రకటించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చినబాబు మాట్లాడుతూ ధవళేశ్వరం నుంచి పైపులైన్ల ద్వారా నేరుగా తాగునీటిని సరఫరా చేసేందుకు వాటర్ గ్రిడ్ ప్రపోజల్‌ను పంపించామన్నారు. జలజీవన్ మిషన్ కింద మండలంలో 32 ఓహెచ్ఎస్సార్ ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదించామని, 16ట్యాంకుల నిర్మాణం జరుగుతుందని, మిగిలిన 16ట్యాంకుల నిర్మాణానికి స్థలాలను చూపించాలని స్థానిక సంస్థల ప్రతినిధులను ఎంపీపీ భాగ్యలక్ష్మి కోరారు. ఇమ్మిడివరప్పాడు సర్పంచ్ రేలంగి దుర్గారావు, తాండవపల్లి, సమనస ఎంపీటీసీలు రేవు శ్రీను, ఉడుం రామకృష్ణలు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద ట్యాప్‌లు వేశారు తప్ప ఎక్కడ సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. నాడు-నేడు పాఠశాల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయనిసర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు పేర్కొన్నారు. పేరూరు కుమ్మరికాల్వ డ్రెయిన్‌పై డ్యామ్ కూలిపోయి ఎంతో కాలమైనా ఇంతవరకు పట్టించుకోలేదని ఎంపీటీసీ సుబ్బరామ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. పలు సమస్యలను ఎంపీటీసీలు దొంగ ఆంజనేయులు, వాసంశెట్టి శ్రీనివాసరావు, మోటూరి కనకదుర్గ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో ఉంద్రు బాబ్జిరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా వెంకటసుబ్రహ్మణ్యం, పొలమూరి బాలకృష్ణ పాల్గొన్నారు.


ప్రొటోకాల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ రాము తదితరులు

అభివృద్ధి పనుల జాబితాను సిద్ధం చేయండి


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, అక్టోబరు9: గత ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై జాబితాను సిద్ధంచేసి త్వరితగతిన అందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారులను కోరారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడానని, 2022-24 ఏడాదికి రూ.4కోట్లు నిధులు మంజూరు చేశామని, అవి పూర్తి కాగానే కొత్త నిధులు మంజూరు చేస్తామని ఓఎన్జీసీ అధికారులు చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలలను సందర్శించి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ సమస్యలను గ్రామాలు వారీగా తీర్మానాలుచేసి అందిస్తే, సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేస్తారన్నారు. గ్రామాలు వారీగా శ్మశానవాటికల వివరాలను సర్పం చ్‌లు అధికారులకు అందించాలని, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 14నుంచి 20వరకు గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఉపాధిహామీ, పంచాయతీ, జిల్లా పరిషత్ నిధులతో చేపట్టబోయే పనులకు భూమిపూజలు చేస్తామని ఎమ్మెల్యే వివరించారు. కుందాలపల్లిలో పాఠశాల ఎత్తు పెంచాలని సర్పంచ్ శ్రీనివాసరావు కోరారు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం దివ్యాంగులకు సర్టిఫికెట్లు మంజూరు, సదరం క్యాంపులు మండల కేంద్రంలో జరిగేలా చూడాలని ఎంపీటీసీ పల్లి మోసే, సర్పంచ్ గుడాల రామారావు కోరారు. దీనిపై డీఅండ్‌హెచ్‌వో, డీసీహెచ్ఎస్‌లతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతామని అధికారులు చెప్పారని ఎమ్మెల్యే వివరించారు. లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని, మానేపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, 2022 వరదల్లో లంకలగన్న వరంలోనష్టపోయిన వారికి 45ఇళ్లను మంజూరు చేయాలని సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, ఎంపీటీసీలు అవనిగడ్డ సత్తి బాబు, దామోదరం, సాయిబాబు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారం కోసం గ్రామస్తుల ఆందోళన

కాట్రేనికోన, అక్టోబరు9: గతంలో జరిగిన గ్యాస్‌లీక్‌లో బాధితులకు నష్టపరిహారం డిమాండ్ చేస్తూ బుధవారం ఉప్పూడిలో గ్రామస్తులు ఆందోళన చేశారు. ఓఎన్జీసీకి వెళ్లే దారికి అడ్డంగా శిబిరం ఏర్పాటు చేసి ఆందోళన చేపట్టారు. 2020లో జరిగిన గ్యాస్‌లీక్‌కు సంబంధించి నష్టపోయిన రైతులను, కుటుంబాలను ఆదుకోవాలంటూ నినాదాలుచేశారు. ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని గతంలో నాలుగున్నర ఎకరాల భూమిని ఓఎన్జీసీ లీజుకు తీసుకుంది. తమ కార్యకలాపాలు నిలిపివేసిన తర్వాత ఐదేళ్ల నుంచి లీజు చెల్లించడం లేదని రైతులు బొబ్బిలి పాపారావు, ఇతర రైతులు ఆందోళన చేశారు. గ్యాస్ లీక్ అనంతరం గ్రామంలోని రేషన్‌కార్డుదారులకు రూ.5,000 వంతున ఇస్తామని ఓఎన్జీసీ హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు హామీ నెరవేర్చలేదని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నాగిచెరువు సమీపంలో ఓఎన్జీసీ కార్యకలాపాలు ప్రారంభించిందని, ఫలితంగా తమ గ్రామ రహదారి ధ్వంసమవుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. రైతుల భూములకు లీజు చెల్లించి, గతంలో హామీ మేరకు ప్రతి కుటుంబానికి రూ.5,000 చెల్లించాలని, లేకుంటే కార్యకలాపాలను అడ్డుకుంటామని ఆందోళనకారులు హెచ్చరించారు. సర్పంచ్ రంబాల రమేష్ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు ఏర్పాటుచేశారు.


ఓఎన్జీసీ సైట్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

రూ.3.87లక్షల ఆదాయం

అయినవిల్లి, అక్టోబరు 9: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన పలు పూజా కార్యక్రమాలు, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.87లక్షల ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. అన్నప్రసాద విరాళం కింద రూ.1,24,962 ఆదాయం వచ్చిందన్నారు. 190 లఘున్యాస అభిషేకాలు, 28 శ్రీలక్ష్మీగణపతి హోమాలు నిర్వహించారు.


అమలాపురం, రాయవరం (మం) వెదురుపాకలో, యానాంలో అలంకరణల్లో అమ్మవార్లు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

అల్లవరం, అక్టోబరు 9: కూటమి ప్రభుత్వం రైతులకు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు రాయితీపై ఇస్తుందని ఏవో ఎస్వీవీ సత్యనారాయణ చెప్పారు. యెంట్రుకోన రైతు సేవా కేంద్రం వద్ద సర్పంచ్ తిక్కిరెడ్డి నాగవెంకట శ్రీనివాస్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది సదస్సు జరిగింది. గెద్దాడ శ్రీనివాసరావు, ఈటి గోపాలరావు, వర్రే సూరిబాబుతో పాటు రైతులు పాల్గొన్నారు.

వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా

అమలాపురంటౌన్, అక్టోబరు 9: కలెక్టరేట్‌లోని వికాస జిల్లా కార్యాలయం వద్ద వైభవ్ జ్యూవెలరీస్‌లో ఉద్యోగాల భర్తీ కోసం బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. 172 మంది అభ్యర్థులు హాజరుకాగా వివిధ కేటగిరీలకు సంబంధించి 31మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వారిని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అభినందించారు. ఉద్యోగ నియామక పత్రాలను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అందజేశారు. వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, హెచ్ఆర్‌టీం సభ్యులు పాల్గొన్నారు.

కాన్షీరామ్ వర్ధంతి

అమలాపురం టౌన్, అక్టోబరు 9: అంబేడ్కర్‌కు నిజమైన వారసుడిగా కాన్షీరామ్ నిలిచారని బహుజన సమాజ్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు అన్నారు. కామనగరువు మేదా గార్డెన్స్‌లో బుధవారం కాన్షీరామ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, కోలా వికాస్, కడిమి రాజు, మల్లాడి సత్తిబాబు, సుహాస్ పాల్గొన్నారు.

ఆకు ఎండు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపేట, అక్టోబరు9: వరిలో ఆకు ఎండు తెగులుపై అప్రమత్తంగా ఉండాలని ఏవో పద్మలత సూచించారు. బిళ్లకుర్రులో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పొలానికి ఆకు ఎండు తెగులు ఆశిస్తే నివారణకు ఎకరానికి 100 గ్రాముల ప్లాంటోమైసిన్, కాపర్ ఆక్సీక్లోరైడ్ 450గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

రాయవరం, అక్టోబరు 9: వెదురుపాక, నదురుబాద గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలోని 19 రైతుసేవా కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తామన్నారు. సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి, టీడీపీ నేతలు సత్తి శ్రీనివాస రెడ్డి, కొవ్వూరి చంటిరెడ్డి, కప్పిరెడ్డి తాతాజీ, గ్రామ వ్యవసాయ సహాయకులు తులసీధర్, శిరీష పాలొగన్నారు.

రైతులకు సూచనలు

అంతర్వేది, అక్టోబరు 9: వ్యవసాయశాఖ, ఉద్యానశాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గొంది, గుడిమూల గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు దొండపాటి రవికిరణ్, దంతులూరి శ్రీహరిరాజు, దొండపాటి రవికుమార్ రైతులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ హెచ్ఈవో దుర్గారావు, గుడిమూల మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు డాక్టర్ పద్మరాజు, రైతులు, వ్యవసాయ ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జక్కంపూడి వర్ధంతి

అమలాపురం టౌన్, అక్టోబరు 9: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు 13వ వర్ధంతిని ఐటీ విభాగం జిల్లాశాఖ అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. నల్లవంతెన వద్ద ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న రామ్మోహనరావు విగ్రహానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి-బాబు, జడ్పీటీసీ పందిరి శ్రీహరి తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మట్టపర్తి నాగేంద్ర, కొల్వకొలను ఉమ, జిల్లెళ్ల రమేష్, సలాది గుప్పి పాల్గొన్నారు.

జక్కంపూడి సేవలు అమూల్యమైనవి

మామిడికుదురు, అక్టోబరు 9: మంత్రిగా దివంగత జక్కంపూడి రామ్మోహనరావు చేసిన సేవలు అమూల్యమైనవని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి కొనియాడారు. జక్కంపూడి వర్ధంతిని మామిడికుదురులో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కొమ్ముల రాము, నెల్లి దుర్గాప్రసాద్, కటకంశెట్టి ఆదిత్యకుమార్, తోరం బాస్కర్, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు, నయినాల సత్యంమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు పూజలు

రావులపాలెం, అక్టోబరు 9: ఈతకోట జాతీయ రహదారి చెంతనే ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకులు ఖండవల్లి నారాయణచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈపూజల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు యర్రంశెట్టి నాగేశ్వరరావు, మిరియాల రాము, యర్రంశెట్టి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 320 దరఖాస్తులు

రాజోలు, అక్టోబరు9: రాజోలుప్రొహిబిషన్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో రాజోలు మండలంలో ఎనిమిది మద్యం దుకాణాలు, మలికిపురం మండలంలో 9, సఖినేటిపల్లి మండలానికి 7, మామిడికుదురు మండలానికి 5దుకాణాలకు 320 దరఖాస్తులు అందాయని రాజోలు సీఐ కె.వీరబాబు తెలిపారు. ఈనెల11వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువును ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఈనెల14న ప్రభుత్వం లాటరీలో లైసెన్సులు ఎంపిక చేస్తారని తెలిపారు. 16నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం అవుతాయని, ఆరోజు నుంచి కొత్తమద్యం విధానం అమలులోకి వస్తుందన్నారు.

ఆలమూరు సర్కిల్‌లో 250 దరఖాస్తులు

ఆలమూరు, అక్టోబరు 9: ఆలమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎ ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో 20మద్యం షాపులకు 250 దరఖాస్తులు వచ్చినట్లు ఆలమూరు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. మరో రెండు రోజులు గడువు పొడిగించడంతో శుక్రవారం సాయంత్రం ఏడు గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

అంతర్వేది, అక్టోబరు 9: గొంది గ్రామంలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో చెయ్యి కోల్పోయిన బర్రే దుర్గాభవానీకి బుధవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ రూ.72,500 అందించారు. ఇజ్రాయిల్ నుంచి జిల్లెళ్ల శేఖర్ ఆధ్వర్యంలో సోషల్‌మీడియా ద్వారా సమకూర్చిన రూ.60వేలు, గొంది స్కూలులో చదువుతున్న భవానీ సహచర విద్యార్థులు సమకూర్చిన రూ.17,500, మట్టపర్రు సర్పంచ్ రూ.5వేలు అందించినట్టు తెలిపారు. అనంతరం రామేశ్వరం కాల్వరేవు సెంటర్‌లో దేవి నవరాత్రులు సందర్భంగా పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దేవ పాల్గొన్నారు. గొంది గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ బొడ్డు దుర్గాప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, జనసేన రాష్ట్ర నాయకుడు గెద్దం మహలక్ష్మిప్రసాద్, సర్పంచ్ దొండపాటి రవికిరణ్, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, ఆకన బాబ్జినాయుడు, రావూరి నాగు, పాటబళ్ల సూరిబాబు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

ముమ్మిడివరం, అక్టోబరు 9: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ పార్టీ హర్యానాలో హ్యాట్రిక్ సాధించడంపై ముమ్మిడివరంలో ఆ పార్టీ నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. తటవర్తి నాగరాజారావు కార్యాలయంలో కేక్‌ను కట్‌చేసి మిఠాయిలు పంచారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గొలకోటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, కొయ్యల దుర్గారావు, మట్టా సూరిబాబు, కోనే రామమూర్తి, అల్లూరి సత్యనారాయణరాజు, బసవా శ్రీహరిబాబు, గనిశెట్టి బాబి, మోకా వెంకటసుబ్బారావు, సుంకర సాయిరామ్ పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 9: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,70,071 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి హైదరబాద్ మదీనాగుడాకు చెందిన జయంతి వెంకట సూర్యనారాయణమూర్తి- భాగ్యలక్ష్మి దంపతులు రూ.47,500 విరాళం సమర్పించారు. దాతలకు ఈవో స్వామివారి చిత్రపటం అందజేశారు.

దుర్గాదేవికి వెండి కిరీటం బహూకరణ

ఉప్పలగుప్తం, అక్టోబరు 9: ఎస్.యానాంలో కొలువై ఉన్న శ్రీప్రసన్నాంబికాదుర్గాదేవికి దాతలు వెండి కిరీటం బహూకరించారు. గ్రామంలోని బీచ్ రోడ్డులో ఉన్న దుర్గాదేవికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వెండి కిరీటాన్ని అలంకరించి గ్రామఆడపడుచులు అమ్మవారికి గాజులు, పసుపు కుంకుమలతో ముడుపులు చెల్లించుకున్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

మలికిపురం, అక్టోబరు9: విశ్వేశ్వరాయపురానికి చెందిన రాపాక నాగరాజు కుమార్తె పెర్సీకు(7) మెదడులోనీరు చేరి ఇన్ఫెక్షన్ అయింది. ఆ కుటుంబానికి కువైట్‌లోని నల్లి కుమారరత్నం, గొల్లమండల ప్రవీణ్ సేకరించిన రూ.20 వేలను జీసెస్‌హోప్‌చారిటీ సభ్యులు అందించారు. గొల్లమండల రాజబాబు, చవ్వాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు పటిక బెల్లంతో తులాభారం



మండపేట, అక్టోబరు9: ఎమ్మెల్యేగా వేగుళ్ల విజయం సాధించాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడాలని టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి అయ్యప్ప స్వామికి మొక్కుకున్నారు. బుధవారం ద్వారపూడి అయ్యప్ప స్వామిఆలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు 70కిలోల పటిక బెల్లంతో తులాభారం వేసి బాబ్జి మొక్కు చెల్లించుకున్నారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జీ మర్రెడ్డి శ్రీనివాస్, తులా విష్ణు, చేకూరి రమేష్‌రాజు, వేగుళ్ల అజయ్‌బాబు, గడి రాం బాబు, టీడీపీ, జనసేన ద్వారపూడి గ్రామఅధ్యక్షులు సత్తి సత్యనారాయణ, చింతా దొరబాబు, తొం టెపు రామారావు, గోణం పుల్లయ్య, కర్రి తాతారావు, కంటిపూడి శ్రీను, పాలచర్ల శిరిషా, మచ్చా నాగు, టీడీపీ కపిలేశ్వరపురం మండల అధ్యక్షుడు ముత్యాల వెంకట్రావు, సుంకర నాని పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

ఉప్పలగుప్తం, అక్టోబరు 9: భీమనపల్లి పీహెచ్‌సీలో బుధవారం 28మంది గర్భిణులకు డాక్టర్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. ఏడుగురిని అత్యవసర పరీక్షల నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పీఎంఎస్ఎంఏ ప్రోగ్రాంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రాయుడు రామకృష్ణ, పీహెచ్ఎన్ శోభారత్నం పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ పి.విష్ణువర్ధన్ 21మంది గర్భిణులకు పరీక్షించి, ఒకర్ని సీరియస్ కేసుగా గుర్తించి ప్రత్యేక వైద్య సేవలందజేసారు. హెచ్ఈ రామారావు, హెచ్‌వీ మేరీమణి, స్టాఫ్‌నర్సు శ్యామలారాణి, ఫార్మాసిస్ట్ ఆలీ పాల్గొన్నారు.

సౌమ్యకు తెలంగాణా డీఎస్సీలో 18వ ర్యాంకు



ముమ్మిడివరం, అక్టోబరు 9: ముమ్మిడివరానికి చెందిన మట్టపర్తి సౌమ్య తెలంగాణ డీఎస్సీలో నల్గొండ జిల్లా నుంచి పరీక్ష రాసి ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా 18వ ర్యాంకును సాధించారు. సెకండరీ గ్రేడ్ టీచరుగా నియామక పత్రం అందుకోవడానికి బుధవారం ఆమె ముమ్మిడివరం నుంచి బయలుదేరి వెళ్లారు. సౌమ్య తండ్రి రాంబాబు గేదెల్లంక మండలపరిషత్ హైస్కూలులో హెచ్ఎంగా పనిచేస్తున్నారు. సెకండ్ గ్రేడ్ టీచరుగా బొమ్మూరులో ఆమె శిక్షణ పొందారు. తెలంగాణా డీఎస్సీలో నల్గొండ జిల్లా నుంచి సౌమ్య 18వ ర్యాంకును సాధించి ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా అర్హత సాధించడం పట్ల ఆమెను పలువురు అభినందించారు. ఉపాధ్యాయినిగా అవ్వడానికి తన తండ్రే స్ఫూర్తి అని ఆమె తెలిపారు.

తహశీల్దార్‌గా ఆచార్యులు



మామిడికుదురు, అక్టోబరు 9: మామిడికుదురు తహసీల్దార్‌గా వైవీ సుబ్రహ్మణ్య ఆచార్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అడ్డతీగల ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన బి.మృత్యుంజయరావు కె.గంగవరం బదిలీపై వెళ్లారు. సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు స్వాగతం తెలిపారు.

ఎంపీడీవోగా బాలాజీ



మలికిపురం, అక్టోబరు 9: మలికిపురం ఎంపీడీవోగా నిమ్మగడ్డ బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. రాజోలు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఎంపీడీవో బాలాజీని ఎంపీపీ ఎంపీ సత్యవాణి కార్యాలయ పరిపాలనాధికారి మిల్టన్, పలు గ్రామాల సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

ఈవోపీఆర్డీగా దాసరి



మండపేట,అక్టోబరు9: మండపేటఈవోపీఆర్డీగా దాసరి శ్రీనివాసరావు బుధవారంబాధ్యతలు స్వీకరించారు. ఆత్రేయపురం బదిలీపైఇక్కడకు వచ్చారు. శ్రీనివాస్ ఎంపీడీవో సత్యన్నారాయణను కలిశారు. శ్రీనివాస్‌ను మండల పరిషత్ సిబ్బంది,కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేసిన ఐదం రాజు ఆలమూరు బదిలీ అయ్యారు.

ఈవోపీఆర్డీగా రాజు



ఆలమూరు, అక్టోబరు 9: ఆలమూరు ఈవోపీఆర్డీగా ఎ.రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మండపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన రాజకుమార్ ఉప్పలగుప్తం బదిలీపై వెళ్లారు. రాజును ఎంపీడీవో జాన్‌లింకన్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యాపక సంఘం గౌరవాధ్యక్షుడిగా నల్లా



అమలాపురం టౌన్, అక్టోబరు 9: ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపక సంఘం గౌరవాధ్యక్షుడిగా అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహమూర్తిని ఎన్నుకున్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో నిర్వహించిన తెలుగు అధ్యాపకుల సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని నల్లాకు అందజేశారు. ఈసందర్భంగా నల్లాను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, కొల్లి రమావతి, రుద్రరాజు నానిరాజు, బీవీవీ సత్యనారాయణ, ఏఎస్ రఘు, శ్రీపాద రామకృష్ణ అభినందించారు.

రామిరెడ్డికి ఎమ్మెల్యే బండారు పరామర్శ

రావులపాలెం, అక్టోబరు 9: రావులపాలానికి చెందిన స్వర్ణాంధ్ర సంస్థ రామిరెడ్డి సోదరుడు వీరరాఘవరెడ్డి ఇటీవల మృతిచెందారు.బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రామిరెడ్డిని పరామర్శించి ఓదార్చారు.

ఇద్దరి ప్రాణాలు కాపాడిన హెడ్‌కానిస్టేబుల్‌కు సత్కారం



పి.గన్నవరం, అక్టోబరు 9: వరదల సమయంలో గంటిపెదపూడిలో జరిగిన పడవ ప్రమాద సమయంలో హెడ్‌కానిస్టేబుల్ మురళీమోహనకృష్ణ చాకచక్యంగా వ్యవహరించి ఇద్దరి ప్రాణాలు కాపాడారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్తుల సమక్షంలో హెడ్‌కానిస్టేబుల్‌ను ఘనంగా సన్మానించారు. పడవ డ్రైవర్, హెచ్‌సీ ఉద్యోగ ధర్మాన్ని పాటించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారని అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.శివకృష్ణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, సర్పంచ్ దంగేటి అన్నవరం, ఎంపీటీసీ పల్లి మోసే, యర్రంశెట్టి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా మమత



అంబాజీపేట, అక్టోబరు 9: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా డాక్టర్ ఎం.మమత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆముదాలవలసలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆరేళ్లు, కొవ్వూరు పరిశోధన కేంద్రంలో అఖిల భారత దుంప పంట సమన్వయ పథకంలో 16ఏళ్లు మమత పనిచేశారని కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. దుంప పంటలపై దేశంలో ప్లాంట్ మెటీరియల్ ప్రొడక్షన్‌లో రెండు సార్లు ఉత్తమ శాస్త్రవేత్తగా మమత అవార్డులను అందుకున్నారని తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

ర్యాంపులను పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం, అక్టోబరు9: ఈనెల15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇసుకను అందించే చర్యలు చేపట్టడంతో బుధవారం అంకంపాలెం, ఆత్రేయపురం, పులిదిండి ఇసుక ర్యాంపులను కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పరిశీలించారు. ప్రస్తుతం గోదావరిలోని ఇసుక ర్యాంపుల్లో నీటి ప్రవాహం ఉంది. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, తహసీల్దారు రాజేశ్వరరావు, ఆర్ఐ భవాని పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం వద్దు.. చేతి సంచులే ముద్దు..

మండపేట, అక్టోబరు 9:ప్లాస్టిక్ వినియోగంవద్దని, చేతి సంచులే ముద్దని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు పిలుపుఇచ్చారు. ప్లాస్టిక్ రహిత మండపేటగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన సచివాలయ ఉద్యోగులు శానిటేషన్, సచివాలయ వార్డు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.తడిచెత్త పొడిచెత్త వేరు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డీఈఈ శ్రీనివాస్, ఏఈ పవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, ఆర్‌వో శాస్త్రి, ఆర్.అందేశ్రీనివాస్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.